

అగ్ని ప్రమాద బాధితులకు ఎంఎల్‌సి పరామర్శ

ప్రజాశక్తి - అయినవిల్లి

చింతనలంక గ్రామంలో జాంబవానిపేటలో అగ్ని ప్రమాద ఘటనలో నిరాశ్రయులైన ఏడు కుటుంబాలను ఆదివారం ఎంఎల్‌సి బొమ్మి ఇజ్రాయిల్ పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి 25 కేజీల బియ్యం, రెండు రగ్గులు, దుస్తులు, బకెట్లు, నిత్యా వసరాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అయినవిల్లి జడ్‌పిటిసి సభ్యులు గన్నవరపు శ్రీనివాసరావు, సర్పంచ్ చింతలపూడి వెంకటరత్నం, ఎంపిటిసి సభ్యులు కొల్లాబత్తుల సాయిలక్ష్మి శ్రీను, మల్లిపూడి కోటేశ్వరరావు, సవరపు ఏసుబాబు, ఆకుమర్తి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.


నిత్యావసరాలు అందజేస్తున్న ఎంఎల్‌సి ఇశ్రాయిల్

తుపానుతో రైతుల బెంబేలు

- పలుచోట్ల పంటనష్టం
- స్తంభించిన జనజీవనం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి, యంత్రాంగం

తుపాను ప్రభావంతో ఆదివారం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా వర్షం కురిసింది. ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు సౌకర్యాలు లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. ధాన్యం కోతలు పూర్తయ్యే రోజుల్లో అపార నష్టం తెచ్చిపెట్టింది. ఖరీఫ్‌లో తీవ్ర వర్షాభావం ఎదురైనప్పటికీ కోతల సమయంలో వర్షాలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా 1.75 లక్షల ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 65 శాతం కోతలు పూర్తయ్యాయి. 2.50 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు లక్ష్యం తీసుకోగా 232 రైతు సేవా కేంద్రాలు ఇప్పటి వరకూ 1.60 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు జరిగినట్లు తెలుస్తోంది. కొంత ధాన్యం ఇప్పటికే దళారులు కొనుగోలు చేయగా అత్యధిక భాగం ఇంకా కళ్లాల్లోనే ఉంది. వర్షం నేపథ్యంలో ఆరబెట్టుకొనే సౌకర్యం లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద 17 శాతం కంటే ఎక్కువ తేమ ఉంటే కొనుగోలుకు నిబంధనలకు అడ్డుగోడలుగా మారుతున్నాయి. అకాల వర్షాలు, తుపాన్ల సమయంలో పంట ఉత్పత్తులను కాపాడుకునేందుకు రైతులకు టార్పాలిన్లు అత్యవసరం. వరి నూర్పిడి చేసిన తరువాత ధాన్యం ఆరబెట్టే క్రమంలో వర్షాలకు, మంచు వల్ల తడిసిపోకుండా టార్పాలిన్లు వాడతారు. ప్రధానంగా పంట దిగుబడులు చేతికొచ్చే దశలో తుఫాన్లు, వర్షాలు కురిస్తే టార్పాలిన్లకు విపరీతమైన డిమాండ్ ఉంటుంది. గత ప్రభుత్వాలు 50 శాతం రాయితీపై రైతులకు పంపిణీ చేసేవి. గత 6 సంవత్సరాలుగా పంపిణీ నిలిచిపోయింది. దీంతో బహిరంగ మార్కెట్‌లో అధిక ధర చెల్లించి కొనుగోలు చేయవలసి వస్తోందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

రామచంద్రపురం ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జనజీవనం స్తంభించింది. వ్యాపార వర్తక సంస్థలు మూతపడ్డాయి. ఒతో బస్టాండ్‌లు, గోదావరి రేవులు జన సంచారం లేక వెలవెల పోయాయి. తొలకరి వరి పండించిన రైతులు తాము పండించిన ధాన్యం మిల్లులకు పూర్తిగా ఎగుమతి చేయకుండానే తుపాను ఏర్పడడంతో ఆందోళన చెందుతున్నారు. మండలంలో ఇప్పటివరకు రైతులు ధాన్యాన్ని మిల్లులకు ఎగుమతి చేశారు. మరో 10 మెట్రిక్ టన్నుల ధాన్యం పంట పొలాల్లో ఉండిపోయింది. అయితే దీన్లో 40 శాతం వరకు ఇంకా ఎగుమతి కావాల్సి ఉందని తెలుస్తుంది.

అయినవిల్లి వరి పంటలు పలుచోట్ల దెబ్బతిన్నాయి ఈదురు గాలులకు అక్కడక్కడ వరి చేలు నేల కొరిగాయి.

ఉప్పలగుప్తం ఎడతెరపి లేని వర్షాలతో గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. ఎడతెరిపిలేని వర్షాలకు రోడ్లు జలమయంగా మారాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఈదురుగాలులతో కురుస్తున్న వర్షానికి చాలా గ్రామాల్లో పంట చేతికొచ్చిన వరిచేలు నేలకొరిగాయి. **తాళ్లరేవు** వర్షానికి తోడు ఈదురుగాలులు వీయడంతో పలుచోట్ల పంట పొలాలు నేలకొరిగాయి. మండలంలో 8,254 ఎకరాల్లో వరి సాగు చేయగా 78 శాతం పంట ఒబ్బిడి చేశారని, ఇంకా 22 శాతం మేర మాసూలు కావాల్సి ఉందని వ్యవసాయ అధికారి ప్రశాంతి తెలిపారు.

పెద్దాపురం మండలంలో వరిచేలు 60 శాతం కోతలు పూర్తయ్యాయి. కోసిన వరి చేలు కుప్పలు వేయగా ఇంకా పనల పైన ఉన్న వరి చేల రైతులు పంట నష్టం జరుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల వ్యవసాయ అధికారి కె.సంజయ్ కుమార్ వరి చేలను పరిశీలించారు. మండల పరిధిలో 3,951 హెక్టార్లలో వరి సాగు చేశారని, దీంట్లో 2,400 హెక్టార్లలో కోతలు పూర్తయ్యాయని తెలిపారు. కొంత పనలపై ఉందన్నారు. ఇప్పటి వరకు మండల పరిధిలోని రైతు భరోసా కేంద్రాల ద్వారా 730 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామన్నారు.

సామర్లకోట రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా వరి పంట కోతలకు అంతరాయం ఏర్పడింది. ఇప్పటికే మసూళ్లు పూర్తి చేసుకుని ధాన్యం ఆరబెట్టుకోవడానికి సిద్ధపడుతున్న రైతులకు అకాల వర్షాలు అడ్డుపడ్డాయి. నూర్పిడి చేసిన ధాన్యాన్ని జాగ్రత్త చేసుకోవడానికి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎక్కడివి అక్కడే రోడ్లపై, చేలల్లో ధాన్యం రాశులను ప్లాస్టిక్ తార్పాలిన్ పరకాలతో కప్పి కాపలా కాస్తున్నారు. వర్షానికి తోడు ఈదురుగాలులు వేగంగా వీయడంతో పలుచోట్ల పంట పొలాలు నేలకొరిగాయి. మండల పరిధిలో 60 శాతం వరి పంట కోతలు పూర్తయినట్లు వ్యవసాయ అధికారి ఇమ్మిడిశెట్టి సత్య చెప్పారు.


అంబేద్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తంలో నేలకొరిగిన వరి చేలు


తాళ్లరేవులో నేలకొరిగిన వరి పంట


వర్షాలతో జనసంచారం లేని ద్రాక్షారామ మెయిన్ రోడ్డు

మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలి

జెసి టి.నిషాంతి

ప్రజాశక్తి - అమలాపురం

తుపాను కారణంగా తేమ శాతం ఎక్కువ ఉన్నా రైతుల నుంచి కనీస మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేయాలని మిల్లర్లకు సూచించామని జెసి టి.నిషాంతి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు ఆర్‌డిఒలు, తహశీల్దార్లకు వ్యవసాయ అధికారులకు టెలికాన్ఫరెన్స్ ద్వారా ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాల మూలంగా రైతులు పండించిన పంట చేతికందే సమయంలో నష్టపోకుండా అప్రమత్తంగా ఉంటూ పంటను కాపాడు కోవాలని, ప్రాథమిక వ్యవ సాయ సహకార పరపతి సంఘాల ద్వారా టార్పా లిన్లను సరఫరా చేస్తున్నారని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఈదురు గాలులతో కూడిన వర్షం రావడంతో అన్నదాతలు ఇప్పటికే నూర్చిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు చేర్చి టార్పాలిన్లతో కాపాడుకుంటూ మండల వ్యవసాయ అధికారులు, తహశీల్దార్ సమన్వయంతో మిల్లులకు తరలించి గిట్టుబాటు ధరలకు విక్రయించు కోవాలన్నారు. ఇప్పటికే రైతు సేవా కేంద్రంలో నమోదైన నూర్చిన ధాన్యం వివరాలను సేకరిస్తూ సురక్షితంగా ఎంఎఒ, తహశీల్దార్లు, ఎల్లులకు తర లించే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఏ రెవెన్యూ డివిజన్‌కు ఆ రెవెన్యూ డివిజనల్ అధికారి ధాన్యం తరలింపు ప్రక్రియను పర్యవేక్షిం చాల న్నారు. మండల స్థాయి అదనపు కంట్రోల్ రూమ్లు నిర్వహిం చడంతోపాటు జిల్లా స్థాయిలో కూడా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. రైతుల సమస్యల కోసం కంట్రోల్ కేంద్రాల ఉన్నాయని అన్నారు. రామచంద్రపురం డివిజన్లో మండపేట, కపిలేశ్వరపురం మండలాలలో ధాన్యం పంట ఎక్కువగా ఉన్న నేపథ్యంలో నూర్పుళ్లు పూర్తయి బయట ఉన్న ధాన్యం సేకరణ, మిల్లుల వద్ద జాప్యా లకు తావు లేకుండా అన్లోడింగ్ ప్రక్రియలు సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు పైలెట్ ప్రాజెక్టుగా డ్రోన్లు ఏర్పాటు చేసి కంట్రోల్ రూమ్‌లకు డ్రోన్ సర్వేను అనుసంధానిస్తూ క్షేత్రస్తా యిలో గుర్తించిన సమస్య లను పరిష్కరిస్తున్నామని అన్నారు. వాతావరణ మార్పులు మూలంగా ఉత్పన్నమైన సమ స్యలను కంట్రోల్ రూమ్‌కి ఫోన్ చేసి పరిష్కరించు కోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు.

454 మందికి ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

రెడ్డిపల్లి గ్రామంలో సర్పంచ్ కరాటం ప్రసన్న ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటుచేసిన ఉచిత మల్టీ స్పెషాలిటీస్ వైద్య శిబిరంలో 454 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. డాక్టర్ కెవిఆర్ రీసెర్చ్ ఫౌండేషన్, సత్యసాయి సేవాసమితి, పిహెచ్ఎ 'సక్షమ్' సౌజన్యంతో ఈ ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలను అందించారు. వైద్య శిబిరంలో వైద్యులు డెర్మాటలాజీ డిడి డాక్టర్ శ్రీమన్నారాయణ, జనరల్ మెడిసిన్ ఎమ్‌డి.డాక్టర్ నరసింహరాజు, జనరల్ సర్జరీ ఎమ్ఎస్. డాక్టర్ వై.అనంతలక్ష్మి, గుండె సంబంధిత వ్యాధి నిపుణులు డాక్టర్ అభిషేక్ వర్మ పాల్గొని ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సుమారు రూ.లక్ష విలువ చేసే మందులు ఉచితంగా పంపిణీ చేశారు. వైద్య శిబిరంలో 17 మంది వైద్యులు పాల్గొని 27 రకాల సేవలను అందించారు. శ్రీసత్య సాయి ట్రస్టు బృందానికి, వైద్యులకు విజయవంతం చేసిన ప్రజలకు ఈ సందర్భంగా సర్పంచ్ కరాటం రత్న ప్రసన్న ప్రవీణ్, పంచాయతీ కార్య దర్శి ఆది. శంకరమ్ కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో కరాటం సూర్యభాస్కరరావు, కొలిశెట్టి జయ ప్రకాష్, నిమ్మకాయల రాంబాబు, రాజులపూడి భీముడు, సాపిరెడ్డి తాతాజీ, మహేష్, నల్ల సతీష్, సమనస రాంబాబు, వెంకటేశ్వర డిగ్రీ కళాశాల కరస్పాం డెంట్ కె.నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.


రెడ్డిపల్లి గ్రామంలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

ఎయిడ్స్‌పై అవగాహనా ర్యాలీలు


అమలాపురంలో ర్యాలీలోపాల్గొన్నడిఎంహెచ్ఒ, వైద్య సిబ్బంది, విద్యార్థులు

ప్రజాశక్తి - యంత్రాంగం

ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా జిల్లాలో అవగాహనా ర్యాలీలు నిర్వహించారు. వైద్యాధికారులు, సిబ్బంది ఎయిడ్స్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

అమలాపురం: హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపరాదని జిల్లా గ్రామీణాభివద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ శివ శంకర ప్రసాద్ తెలిపారు. ఆదివారం అమలాపురం కలెక్టరేట్లోని గోదావరి భవన్లో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో హెచ్ఐవి పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో పీడీ డిఆర్‌డిఎ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికీ దేశంలో ఆంధ్రప్రదేశ్లో ఎక్కువ హెచ్ఐవి కేసులు ఉన్నాయని, రాష్ట్రంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా లో హెచ్ఐవి కేసులు అధికంగా ఉన్నాయన్నారు. ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తూ హెచ్ఐవి వ్యాధిగ్రస్తులకు స్వయం ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకుంటుందని..జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి దుర్గారావు దొర మాట్లాడుతూ ఎయిడ్స్ కు చికిత్స నే లేదు మరణమే అన్న స్థాయి నుంచి ఇది కూడా సాధారణ వ్యాధినే అనే స్థాయికి వైద్య రంగం అభివద్ధి చెందిందన్నారు. జిల్లాలో 2024వ సంవత్సరంలో 28,260 మందికి హెచ్ఐవి పరీక్షలు నిర్వహించగా 178 మందికి పాజిటివ్గా వచ్చిందని .. గర్భిణుల్లో 6 మందికి హెచ్ఐవి పాజిటివ్గా తేలింది అన్నారు. ఒఎన్‌జిసి వారు అందించిన 41 న్యూట్రిషన్ కిట్స్ ను హెచ్ఐవి ఎయిడ్స్ బాధితులకు అందించారు. జన కళ్యాణ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో హెచ్ఐవి ఎయిడ్స్ బాధిత చిన్నారులు వ్యక్తులతో కలిసి అధికారులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు తదితరులు అల్పాహారం స్వీకరించారు. అనంతరం అమలాపురం ఏరియా ఆసుపత్రి నుంచి గడియార స్తంభం వరకు హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిఎంహెచ్ఒ డాక్టర్ భరతలక్ష్మి, అమలాపురం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్రావు, కలెక్టరేట్ ఎఒ కాశీ విశ్వేశ్వరరావు, డిపిఆర్ఒ కె.లక్ష్మీనారాయణ, డాక్టర్ సుమలత, స్వచ్ఛంద సేవ సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. **కపిలేశ్వరపురం:** ఎయిడ్స్ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని అంగర పిహెచ్‌సి వైద్యాధికారిణి డాక్టర్.పిఎస్ఎస్ డి.రత్నకుమారి అన్నారు. అంగర పిహెచ్‌సి ఆధ్వర్యంలో ఎయిడ్స్ వ్యాధి పై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ రత్నకుమారి, ఎంపిహెచ్ఇఒ జె. మల్లికార్జునుడు , హెల్త్ ఎడ్యుకేటర్ బి.రామారావు, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, తదితరులు, పాల్గొన్నారు. **ఆలమూరు:** అంతర్జాతీయ ఎయిడ్స్ నియంత్రణా దినోత్సవం పురస్కరించుకొని మండలంలోని చొప్పెల్ల, పెదపల్ల వైద్యాధికారులు డి.సువర్చల, మల్లికార్జునరావు, పి.భవాని శంకర్, కె.సాయి కిషోర్ ఆధ్వర్యంలో ఎయిడ్స్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరు కషిచేయాలని ర్యాలీ చేస్తూ ప్రతిజ్ఞ చేయించారు. వివిధ సెంటర్లలలో మానవహారాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ కె.జ్యోతి కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ అక్కుల రాజా, సూర్యనారాయణ హెల్త్ సూపర్‌వైజర్లు, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు విద్యార్థులు పాల్గొన్నారు. **మండపేట:** ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండపేట ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆర్. రాధాకుమారి ఆధ్వర్యంలో ఐసిటిసి కౌన్సిలర్ డి.నాగలక్ష్మి ఎయిడ్స్ రహిత సమాజానికి కషిచేయాలని అందరిచే ప్రతిజ్ఞ చేయించారు. హెఐవి గురుంచి ప్రజలకు అవగాహన కల్పిస్తూ కలువపువ్వు సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఆసుపత్రి డాక్టర్లు సతీష్, హెడ్ నర్సు మాధురి, పియంపి అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కోనసత్యనారాయణ, జిల్లా కోశాధికారి మట్టా వీరబాబు తదితరులు పాల్గొన్నారు. **రామచంద్రపురం:** ఏరియా ఆసుపత్రి ఆధ్వర్యంలో ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన ర్యాలీ జరిగింది. జిల్లా డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ మాధవరపు వెంకటేశ్వర్లు, డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ గొల్లపల్లి కృష్ణ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో రిటైర్డ్ డిపిఎంఒ బి. రవీంద్ర, ఎంపిహెచ్ఒ చిక్కాల సూర్యారావు, భారతి భవాని, దొరబాబు, అర్జున్‌రావు, నర్సింగ్ కాలేజ్ స్టూడెంట్స్ ఎస్‌కెపిజిఎన్ జూనియర్ కాలేజ్ విద్యార్థులు, ప్రభుత్వాసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.


మండపేట ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి ఉత్తమ సేవ అవార్డు

పట్టణంలో ఏరియా ఆసుపత్రికి ఉత్తమ సేవ అవార్డును అందజేశారు. ఈ మేరకు విజయవాడలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎం.ప్రవీణ్ ఈ అవార్డును అందుకున్నారు. ఎపి ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ డైరెక్టర్ ఎ.సిరి చేతుల మీదుగా అవార్డును అందుకున్నట్లు సూపరింటెండెంట్ ప్రవీణ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసుపత్రిలో ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు అందజేస్తున్న సేవలను ఈ సందర్భంగా అభినందించినట్లు ఆయన వివరించారు. ఉత్తమ అవార్డును ప్రశంసా పత్రాన్ని జ్ఞాపికను అందజేశారని ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రవీణ్ 'ప్రజాశక్తి'కి వివరించారు.



ఆలమూరులో వైద్యసిబ్బంది నిర్వహిస్తున్న అవగాహనా ర్యాలీ



అంగరలో అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది



ర్యాలీ నిర్వహిస్తున్న రామచంద్రపురం ఏరియా ఆసుపత్రి సిబ్బంది


విజయవాడలో అవార్డు అందుకుంటున్న సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్

నేడు యథావిధిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - అమలాపురం


ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఈనెల 2వ తేదీన సోమవారం ఉదయం 10 గంటల నుంచి యథావిధిగా నిర్వహిస్తారని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం కలెక్టరేట్లోని గోదావరి భవన్‌లో నిర్వహిస్తారని ఆయన తెలిపారు. జిల్లాలో అర్జీదారులు తమ సమస్యలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువచ్చి పరిష్కార మార్గాలు పొందాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ట్రూఅప్ ఛార్జీల పెంపుతో ప్రజలపై భారం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ట్రూ అప్ ఛార్జీల పేరుతో కరెంట్ ఛార్జీలను పెంచి ప్రజల నెత్తిన కూటమి ప్రభుత్వం మోయలేని భారం వేసిందని వైసిపి రాష్ట్ర కార్యదర్శి పితాని బాలకష్ణ ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. ట్రూ అప్ ఛార్జీలను కూటమి ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని, ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యుత్ ఛార్జీలను పెంచమని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం, అధికారం చేపట్టిన ఆరు నెలలు పూర్తి కాకుండానే విద్యుత్ ట్రూ అప్ ఛార్జీల పేరుతో యూనిట్‌కు రూ.2.19 భారం వేసి ప్రజలను మోసం చేసిందన్నారు. ట్రూ అప్ చార్జీలను ఉపసంహరించుకోవాలని లేని పక్షంలో ప్రజల పక్షాన పోరాటం చేస్తామన్నారు.

కార్టూ'నిజం'



ఎల్‌పిజి నిర్వహణపై మహిళలకు అవగాహన

ప్రజాశక్తి - అమలాపురం

ఎల్‌పిజి నిర్వహణ, వంటలో భద్రత గురించి మహిళలకు అవగాహనా కార్యక్రమాన్ని ఆదివారం కేంద్ర ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు నిర్వహించాయి. ఈ కార్యక్రమం అమలాపురం లయన్స్ క్లబ్‌లో నిర్వహించారు. నిర్వాహకులు మాట్లాడుతూ 'సెన్స్ ఆఫ్ డ్యూటీ క్యాంపెయిన్' కింద ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ఈ ఏడాది మార్చి 5న ప్రాథమిక భద్రత తనిఖీ ప్రచారాన్ని శిక్షణ పొందిన సిబ్బంది ద్వారా నిర్వహించి ఇంటింటా తనిఖీలు చేశామన్నారు. ప్రస్తుతానికి 8 కోట్లకు పైగా గృహాలు తనిఖీ చేశారన్నారు. ఈ ప్రచారంలో భాగంగా 'హమారి రసోయి హమారి జిమ్మేదారి' అనే థీమ్‌తో వంటల పోటీలను ఈ నెల 1న ప్రారంభించినట్లు నిర్వాహకులు తెలిపారు. లయన్స్ క్లబ్‌లో ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు విజయవంతంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయన్నారు. ఎల్‌పిజి నిర్వహణ, వంటలో భద్రత గురించి అవగాహన పెంచడం ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. ఎల్‌పిజి హ్యాండ్లింగ్ పద్ధతులకు కట్టుబడి తమ వంట ప్రతిభను ప్రదర్శించేందుకు ఈ పోటీలో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారని అన్నారు. ఈ కార్యక్రమానికి న్యాయ నిర్ణేతలుగా ఎ.అప్పారావు, పంగం ప్రసాద్, డేగల వెంకట్ వ్యవహరించి ఎల్‌పిజి భద్రత, వంటల నాణ్యత, ప్రదర్శన, శుభ్రత వంటి ప్రమాణాలపై వంటల పోటీలో పాల్గొన్న వారిలో విజేతలను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. భద్రత అవగాహనను ప్రోత్సహించే ప్రచారం యొక్క మిషన్‌కు సహకరించినందుకు నిర్వాహకులు, ఎల్‌పిజి గ్యాస్ డీలర్లు, గ్యాస్ డెలివరీ బాయ్స్, మహిళలు పాల్గొన్నారు.


పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

ఆత్రేయపురంలో విద్యుత్ వెతలు

- నాలుగు నెలలుగా లైన్మెన్ లేక ప్రజల అవస్థ
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండల కేంద్రం ఆత్రేయపురం గ్రామానికి నాలుగు నెలలుగా లైన్మెన్ లేకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. విద్యుత్ ట్రిప్ అయినా, ఫ్యూజులు పొడైపోయిన వాటిని వేసే నాథుడే కరువయ్యాడు. దీంతో విద్యుత్ వెతలతో ప్రజలు విసిగిపోతున్నారు. గత నాలుగు నెలలుగా లైన్మెన్ లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఆత్రేయపురం గ్రామ ప్రజలంతా అంధకారంలో మగ్గాల్సిందే. ఇక్కడి లైన్మెన్కు ఉద్యోగోన్నతి రావడంతో వేరే చోటుకు బదిలీ అయి వెళ్లిపోయారు. నేటికీ ఆ పోస్టును భర్తీ చేయలేదు.

నాలుగు నెలలుగా ఇబ్బందులు



ఆత్రేయపురం గ్రామానికి లైన్మెన్ లేకపోవడంతో కరెంటు పోతే అవస్థలు ఎదుర్కొంటున్నాం. రాత్రంతా కరెంటు లేకపోవడంతో దోమలు బాధిస్తున్నాయి. రాత్రి సమ యంలో అయితే మా పరిస్థితి చెప్ప నక్క ర్లేదు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. లైన్మెన్ నియమించాలని విద్యుత్ ఎఇకి ఆదేశాలు జారీ చేసిన వారు పట్టించుకోవడం లేదు. దీంతో మా ఇబ్బందులు వర్ణనాతీతం.

- గాదిరాజు ప్రసాద రాజు

ఒక లైన్మెన్, ఇద్దరు జూనియర్ లైన్మెన్లు ఉండాలి

ఆత్రేయపురం గ్రామానికి లైన్‌మ్యాన్, జూనియర్ లైన్మెన్లు ఇద్దరు ఉండాలి. లైన్ మాన్ భర్తీ చేయమని ప్రజా ప్రతినిధులు, మరియు గ్రామ ప్రజలు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయో జనం లేకపోయిందని ఆత్రేయపురం గ్రామ ప్రజలు వాపోతున్నారు. దీనికి తోడు విద్యుత్ లైన్లన్నీ కొబ్బరి తోటలు పంట పొలాల్లో ఉండడంతో కొబ్బరి ఆకులు చెట్లు కొమ్మలు తగిలి మంటలు చెలరేగి తరసు విద్యుత్ ట్రిప్ అవుతూ ఉంటుంది. దీంతో విద్యుత్ అంతరాయం కలిగితే లైన్మెన్లు వాటిని తొలగించి విద్యుత్తును పునర్థిస్తారు. లైన్ మేనే లేకపోవడంతో తరచుగా కొబ్బరి ఆకులు విద్యుత్ వైర్లపై పడి మంటలు చెలరేగు తున్నాయి దీంతో అక్కడి ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఈ విషయాన్ని ఎన్నిసార్లు మండల శాఖ అధికారులకు తెలియపరిచిన వారి పట్టించుకున్న దాఖలాలు లేవని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


విద్యుత్ తీగలపై కొబ్బరి ఆకు పడడంతో చెలరేగిన మంటలు

సమస్య పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినా..

ఇప్పటికైనా ఉన్నతాధికారులు కలగజేసుకుని ఆత్రేయపురం గ్రామానికి నియమించాలని గ్రామ ప్రజలు కోరుకుంటున్నారు. ఇటీవల కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆత్రేయపురంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. లైన్మెన్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామంటూ గ్రామ ప్రజలు ఈ విషయాన్ని అర్జీ రూపంలో కలెక్టర్‌కి సమర్పించారు. కలెక్టర్ విద్యుత్ శాఖ అధికారులకు లైన్మెన్ నియమించాలని ఆదేశాలు జారీ చేసినా వారు పట్టించుకున్న దాఖలు లేవు.

ప్రజాశక్తి
www.prajasakti.com

అందుబాటులో కంప్యూటరీకరణ సేవలు

జిల్లా సహకార అధికారి మురళీకృష్ణ



ప్రజాశక్తి - అమలాపురం

మరింత మెరుగైన సేవలు అందించేందుకు సహకార సంఘాలను కంప్యూటరీకరణ చేస్తున్నామని జిల్లా సహకార అధికారి మురళీకృష్ణ తెలిపారు. ఇందులో భాగంగా ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా సహకార సంఘాల్లోని సమాచారాన్ని ఆన్‌లైన్ చేసే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలను బలోపేతం చేసే విధంగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. 'ప్రజాశక్తి'తో ఆయన పలు విషయాలను పంచుకున్నారు.

జిల్లాలో ఎన్ని సహకార సంఘాలు ఉన్నాయి, వాటి పరిస్థితి ఎలా ఉంది...

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా 25 డిసిసిబి శాఖల పరిధిలో 166 వ్యవసాయ సహకార పరపతి సంఘాలు ఉన్నాయి. వీటిలో 107 సొసైటీలు లాభాల్లో, 59 సొసైటీలు నష్టాల్లో ఉన్నాయి. ఈ సొసైటీల్లో రూ.129 కోట్లు డిపాజిట్లుగా ఉన్నాయి. రైతులకు వివిధ రకాల రుణాలుగా రూ.1,514 కోట్లు అందించాం. జిల్లాలో చేనేత సహకార సంఘాలు 19 వరకు ఉన్నాయి.

సహకార సంఘాల కంప్యూటరీకరణ ఎంతవరకు వచింది..

సొసైటీల్లో కంప్యూటరీకరణ పనులు దశల వారీగా జరుగుతున్నాయి. ప్రస్తుతం డేటా ఆన్‌లైన్ ప్రక్రియ చేపడుతున్నాం. అవినీతికి అస్కారం లేకుండా పారదర్శకమైన పాలన అందించేందుకు కంప్యూటరీకరణ ఎంతో దోహదపడుతుంది. జిల్లాలోని అన్ని సొసైటీల్లో త్వరలోనే కంప్యూటరీకరణ ప్రక్రియ పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

పలు సంఘాల్లో అవకతవకలపై వచ్చిన ఫిర్యాదులపై ఏమంటారు...

అల్లవరం డిసిసిబి శాఖ పరిధిలోని ఒక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో అవకతవకలు జరిగినట్లు ఫిర్యాదు వచ్చింది. దీనిపై ఒక అధికారిని నియమించి నిజనిర్ధారణ చేయాలని ఆదేశించాం. ఆ అధికారి ఇచ్చిన నివేదిక ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటాం. ఏ సొసైటీలోనైనా అవకతవకలు జరిగినట్లు ఫిర్యాదులొస్తే విచారణ చేస్తాం.

జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ఎంత వరకూ వచ్చింది?

జిల్లాలోని 151 సొసైటీల పరిధిలో ధాన్యం కొనుగోలు ప్రక్రియకు శ్రీకారం చుట్టాం. రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోళ్లు చేస్తున్నాం. ప్రస్తుతం మండపేట, ఆలమూరు, ఆత్రేయపురం మండలాల్లో ధాన్యం కొనుగోళ్లు మొదలయ్యాయి.. మిగిలిన ప్రాంతాల్లో దశల వారీగా ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం.

సంఘాల ఎన్నికల గురించి ఏమైనా సమాచారం ఉందా...

సహకార ఎన్నికలు నిర్వ హించేందుకు శాఖా పరంగా సిద్ధంగానే ఉన్నాం. ఈ ఏడాది డిసెంబర్ 20 వరకూ గడువు ఉంది. ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే ఎన్నికల ప్రక్రియ ప్రారంభిస్తాం.

నేరాలు ఘోరాలు

తృటిలో తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి - దేవరపల్లి

యర్నగూడెం నాగమ్మతల్లి గుడి వద్ద యర్నగూడెం వైపు వస్తున్న కారును పంగిడి గ్రామానికి చెందిన క్వారీ లారీ ఆదివారం ఢీకొట్టింది. ఈ సంఘ టనలో అదృష్టవశాత్తూ కారులో ఉన్న నలుగురురికీ పెను ప్రమాదం తప్పి స్వల్ప గాయాలతో బయట పడ్డారు. కామవరపుకోట నుంచి శుభలేఖలు పంచేం దుకు కారులో వెళ్తుండగా పంగిడి నుంచి వస్తున్న క్వారీ లారీ గండిచెరువు వాగు డౌన్ వద్దకు వచ్చేప్పటికి వర్షపు చినుకుల కారణంగా అదుపుతప్పి కారును ఢీకొందని స్థానికులు తెలిపారు. దేవరపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - చాగల్లు

రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఊనగట్ల గ్రామానికి చెందిన తొర్లపాటి అచ్చిబాబు (33) చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందారు. అదే గ్రామానికి చెందిన తొర్లపాటి కొండయ్యతో కలిసి బైకు పై నిడదవోలు నుంచి ఊనగట్ల వస్తుండగా బ్రాహ్మణ గూడెం శివారు వద్ద వ్యాన్ ఢీకొంది. దీంతో ఇద్దరూ గాయపడ్డారు. అచ్చిబాబును మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించి మృతి చెందినట్లు ఎస్ఐ కె.నరేంద్ర తెలిపారు.

800 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలో సిరివాడ గ్రామంలో ఆదివారం నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ కెవివిడి.అర్జున్‌రావు తెలిపారు. ఈ దాడులకు సంబంధించి ఒకరిపై కేసు నమోదు చేశామన్నారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ పి.చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

54 మద్యం సీసాలతో ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఎక్సైజ్ అధికారులు ఆదివారం నిర్వహించిన దాడుల్లో 50 అక్రమ మద్యం సీసాలతో మండలంలోని కోరంగి పంచాయతీ పెద బొడ్డు వెంకటాయపాలెంకు చెందిన మల్లాడి కామేశ్వరి, జట్లపాలెం గ్రామానికి చెందిన ములగాల ప్రసాద్‌బాబు అనే వ్యక్తి నుంచి 4 అక్రమ మద్యం సీసాలతో అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సిఐ కె.కోటేశ్వర్ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ నాగేంద్రకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

35 మెట్రిక్ టన్నుల పిడిఎస్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - కరప

మండలంలోని నడకుదురు గ్రామంలో 35 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం పట్టుకున్నట్లు కరప ఎస్ఐ టి.సునీత తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. ఈనెల 27వ తేదీన ఉదయం 10:30 నిమిషాలకు సివిల్ సప్లై అధికారులు, రెవెన్యూ అధికారులు పోలీస్ శాఖ కలిసి నిర్వహించిన తనిఖీల్లో నడకుదురు గ్రామంలో లావణ్ ఇంటర్నేషనల్ ప్లాంట్ వద్ద ఆగి ఉన్న 7 వాహనాలను తనిఖీ చేసి శాంపిల్స్ తీసుకుని ల్యాబ్‌కి పంపించగా, సదరు లారీలో 35 మెట్రిక్ టన్నుల పిడిఎస్ బియ్యాన్ని గుర్తించి తెలిపారు. తెలంగాణా రాష్ట్రంలోని సిద్దిపేటకు చెందిన శ్రీ మణికంఠ ట్రేడర్స్‌కు లారీని, బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎస్ఐ టి.సునీత కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి - గండేపల్లి

యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివనాగు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 30వ తేదీ మధ్యాహ్నం సుమారు 3:00 సమయంలో యల్లమిల్లి గ్రామానికి చెందిన యువతీ తన ఇంటి నుంచి దగ్గర్లోని కిరాణా దుకాణం వద్ద వెళ్లి తిరిగి ఇంటికి రాలేదన్నారు. ఆమె ఆచూకీ లభించకపోవడంతో తల్లి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - కాకినాడ

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి భాధ్యత అని ఎపి నేషనల్ గ్రీన్ కోర్ ప్రాంతీయ సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం స్థానిక జగన్నాథపురం ఎంఎస్ఎన్ చారిటీస్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో 'పర్యావరణ పరిరక్షణలో విద్యార్థుల పాత్ర' అనే అంశంపై చిత్రలేఖనం పోటిలను నిర్వహించారు. ఈ పోటిలకు 17 పాఠశాల నుంచి 76 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటిలలో విజేతలకు డిసెంబర్ 3వ తేదిన నిర్వహించు జిల్లా స్థాయి పర్యవరణ సైన్స్ కాంగ్రెస్‌లో బహుమతులు ఇవ్వనున్నారు.

సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ఎన్నికల ముందు కూటమి పార్టీలు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బుగత బంగార్రాజు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఈ నెల 4న విజయవాడ జింఖానా గ్రౌండ్స్‌లో జరిగే ప్రజా హక్కుల సభను విజయవంతం చేయాలని పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్ల బొల్లి కబుర్లతో ప్రజాకర్షక పథకాలను ప్రకటించి అధికారంలోకి వచ్చాక వాటి ఊసెత్తకపోవడం దారుణమన్నారు. కూటమి పార్టీలు ఇచ్చిన హామీల అమలు కోసం ప్రజలు ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు.

వైసిపి కార్యకర్తకు సాయం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

మండలంలోని గిరిజన తండా బవురువాక గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్త చింతల లోవరాజు మాతృమూర్తి వియోగంతో బాధప డుతున్నాడు. ఈ సమాచారాన్ని తెలుసుకున్న వైసిపి నాకులు ముదునూరి మురళీకృష్ణంరాజు ఆదివారం పరామర్శించారు. లోవరాజు కుటుంబానికి రూ.5 వేలతోపాటు, 50 కేజీలు బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా నా వంతు సహకారాన్ని అందజేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి ఏనుగు శ్రీను పాల్గొన్నారు.



కొత్తపేట ఆర్‌డిఒ శ్రీకర్ దంపతులను సత్కరించిన ఆలయ అర్చకులు

బాల బాలాజీని దర్శించుకున్న ఆర్‌డిఒ దంపతులు

ప్రజాశక్తి - మామిడికుదురు

అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ స్వామి వారిని కొత్తపేట ఆర్‌డిఒ శ్రీకర్ దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చక బందం ఆలయం మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు ఆర్‌డిఒ దంపతులకు ఆలయ ప్రధాన అర్చకులు వేద ఆశీర్వచనం అందజేసి శ్వేత వస్త్రముతో సత్కరించారు. ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణ రాజు ఆధ్వర్యంలో ఆలయ ఉద్యోగులు ఆర్డీవో దంపతులకు స్వామివారి చిత్రపటం, ప్రసాదము అందజేశారు.

నెలలో దర్శించుకున్న 2.28 లక్షల యాత్రికులు

అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ స్వామిని కార్తీక మాసం సందర్భంగా నెల రోజులు గత నెల నవంబర్ 2వ తేదీ శనివారం నుండి డిసెంబర్ 1వ తేదీ ఆదివారం వరకు 2,28,360 యాత్రికులు దర్శించుకున్నారని ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణ రాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్న ప్రసాదం స్వీకరించిన భక్తుల సంఖ్య 1,01,280 అని తెలిపారు. గత ఏడాది కార్తీకమాసంలో కంటే బాల బాలాజీ స్వామిని దర్శించుకున్న భక్తులు సంఖ్య సుమారుగా 81,710 మంది అధికమన్నారు. గత సంవత్సరం ఆదాయం రూ.30,25,266. ఈ సంవత్సరం ఆదాయం రూ.57,45,465 వచ్చిందన్నారు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం ఆదాయం .రూ.27,20,199 అధికంగా వచ్చినదని ఆయన తెలిపారు.

నూకాంబిక ఆలయ అభివృద్ధి వేగవంతం

ప్రజాశక్తి - ఆలమూరు

నూకాంబిక ఆలయ అభివృద్ధి వేగవంతం చేస్తామని, దాతల సహకారం కూడా అవసరమని ఆలయ ఇఒ ఉండవల్లి వీర్రాజు చౌదరి అన్నారు. చింతలూరులో వేంచేసి ఉన్న నూకాంబిక అమ్మవారి దేవస్థాన ఆలయ ప్రాంగణంలో ఆయన ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, చండీయాగాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే నూతనంగా ఆలయ ముఖ మండపం, ప్రాకారాలు నిర్మాణం జరిగి మెరుగులు దిద్దుకుంటున్నాయన్నారు. ఇందులో భాగంగా ఆలయానికి రెండు గాలి గోపురాల నిర్మాణం మిగిలి ఉన్నాయన్నారు. అవి తూర్పున ఒకటి, పడమరలో ఒకటిగా ఏర్పాటు చేయాలనుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఇందుకు యాత్రికులు, దాతలు ముందుకు వచ్చి ఆలయ గాలి గోపురాల నిర్మాణానికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, గ్రామ పెద్దలు, యాత్రికులు పాల్గొన్నారు.

వర్తక సంఘం వన సమారాధన

ప్రజాశక్తి - తాళ్లరేవు

సుంకరపాలెం శ్రీలక్ష్మీ గణపతి వరసిద్ధి వినాయక వర్తక సంఘం ఆధ్వర్యంలో నూతన కమిటీ సహకారంతో కార్తీక వన సమారాధన కార్యక్రమం స్థానిక కళ్యాణ మండపంలో ఆదివారం ఘనంగా జరిగింది. ముందుగా వర్తక సంఘం ప్రతినిధులు, తమ కుటుంబ సభ్యులు ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. వర్తక సంఘం నూతన అధ్యక్షులు పుగాకు వాసును ఘనంగా సత్కరించారు. వివిధ ఆటల పోటీలలో ప్రతిభ చాటిన విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వర్తక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఎంఎల్ఎను కలిసిన అసిస్టెంట్ పిపి

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూను పెద్దాపురం 7వ జిల్లా కోర్ట్ అసిస్టెంట్ పిపి కందుల నరేష్‌కుమార్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నరేష్ కుమార్ మాట్లాడుతూ జ్యోతుల నెహ్రూ ఆశీస్సులతో పెద్దాపురం 7వ జిల్లా కోర్టు ఎపిపిగా బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎస్‌విఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, వేములకొండ జోగారావు, బుర్రి సత్తిబాబు, ఆనివిళ్ల శాస్త్రి పాల్గొన్నారు.

సాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు

ప్రజాశక్తి - ఆలమూరు



మోదుకూరు వద్ద పంట కాలువ పైప్‌లైన్‌కు మరమ్మతులు

మండలంలోని మోదుకూరు నుంచి మండపేట మండలంలోని ఏడిద వెళ్లే సాగునీటి పైపు లైన్‌కు టిడిపి మండల అధ్యక్షుడు మెర్ల గోపాలస్వామి తన సొంత నిధులు రూ.15 వేలు వెచ్చించి ఆదివారం మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సాగునీరు అందించేందుకు పంట కాలువకు కొన్నేళ్ల క్రిందట పైప్ లైన్ ఏర్పాటు చేశారన్నారు. ఇటీవల ఆ పైప్ లైన్ పూర్తిగా పనిచేయకపోవడంతో పొలాలకు సాగునీరు వెళ్లే మార్గం లేక అక్కడ రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని స్థానిక నేతలు తన దృష్టికి తీసుకొని వచ్చారన్నారు. దీంతో వేగంగా స్పందించి రైతులకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షుడు దానం నాగేశ్వరరావు, లస్కర్ నార్ని అచ్యుత్, తదితరులు పాల్గొన్నారు.

నవోదయ పరీక్షకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - ఆత్రేయపురం



నవోదయ పరీక్షలకు శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయులు

మండలం లోని ర్యాలి గ్రామంలో అనూస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్థానిక అనూస్ హోమ్‌లో నవోదయ ఎంట్రన్స్ కు ఉచిత శిక్షణ తరగతులను ఆదివారం ప్రముఖ మనస్తత్వవేత్త డాక్టర్ శ్యామ్ జాదూగర్ ప్రారంభించారు. సందర్భంగా విద్యార్థి విద్యార్థులకు రిసోర్స్ పర్సన్ చింతా తేజశ్రీ నవోదయ పరీక్షలు రాయడానికి అవసరమైన మెళకువలను నేర్పారు.

బాధితునికి నిత్యావసరాల అందజేత

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం



సాయికి నిత్యావసరాలు అందజేస్తున్న జనసేన పార్టీ శ్రేణులు

మునిపల్లికి చెందిన యర్రంశెట్టి సాయి అనారోగ్యంతో బాధపడుతున్నాడు .పేద కుటుంబానికి చెందిన సాయికి వాన పల్లిపాలెంకు చెందిన ఒఎస్ఎస్ ఎంటర్ ప్రైజెస్ అధినేత నల్లా మణికంఠ రామ్ దేవి దంపతులు నిత్యావసరాలను సమకూర్చారు. వీటిని ఆదివారం తీసుకువెళ్లి జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు సాయికి ఇంటి వద్ద అందజేశారు. ప్రతి వారం ఒకరికి సేవా కార్యక్రమాలు చేసేందుకు సహకరిస్తున్న మణికంఠ రామ్ దంపతులకు సాయి కుటుంబం జనసేన పార్టీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి అనుబంధ సంఘాల సమావేశం

ప్రజాశక్తి - అమలాపురం రూరల్



సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఎమ్ఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఉత్తర కోస్తా జిల్లాల నూతన కమిటీల ఏర్పాటుపై భాగంగా ఎమ్ఆర్‌పిఎస్, ఎంఎస్‌పి అనుబంధ సంఘాల డాక్టర్ బిఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా సమావేశం నిర్వహించారు. ఆదివారం అమలాపురం మండలం నడిపూడి బాబు జగ్జీవన్‌రామ్ కమ్యూనిటీ హాల్లో ఈ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్ఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు సవరపు భైరవమూర్తి మాదిగ అధ్యక్షతన ఈనెల 15 నాటికి జిల్లాలో ఎమ్ఆర్‌పిఎస్, ఎంఎస్‌పి, ఎమ్మెస్ఎఫ్, ఎంఎంఎస్ అన్ని విభాగాల గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు క్షేత్రస్థాయిలో కమిటీలు ఏర్పాటుచేసుకోవడం కోసం అన్ని మండల, నియోజకవర్గ, అర్బన్ ఇన్‌ఛార్జులను నియమించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉత్తర కోస్తా జిల్లాల ఇన్‌ఛార్జి పేరెల్లి ఎలీషా మాదిగ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముమ్మిడివరం చిన సుబ్బరావు మాదిగ, యార్లగడ్డ సత్తి బాబు మాదిగ, చుట్టుగుళ్ల నీలకంఠం, ఆకుమర్తి భాస్కర్‌రావు, మల్లవరపు వెంకన్న, ఆకుమర్తి మోహన్ , కొమ్మర వీర రాఘవులు, కాప నాగరాజు, కోడమంచిలి చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.



దొరబాబు దంపతులను సత్కరిస్తున్న ఎంఎల్ఎ వేగుళ్ల

అంకితభావంతో పార్టీకి సేవలు

ప్రజాశక్తి - మండపేట

అంకిత భావంతో సేవలు అందించి టిడిపి అభివద్ధికి కషి చేస్తామని రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ మందపల్లి దొరబాబు సుధారాణి దంపతులు పేర్కొన్నారు. మండపేట దళితపేట లోని తమ నివాసం వద్దఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన కతజ్ఞత కూడిక ప్రార్థనా కార్యక్రమంలో ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావును రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ మందపల్లి దొరబాబు సుధారాణి దంపతులు ఘనంగా సత్కరించారు. మండపేట మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీ వర ప్రకాష్‌ను దొరబాబు దంపతులు సత్కరించారు. కార్యక్రమంలో బుంగ సంజయ్ మాదిగ, దూళి జయరాజు మాదిగ, కౌన్సిలర్లు సవరపు సతీష్, చిట్టూరి సతీష్, గుండు తాతారాజు, చింతలపూడి సత్తిబాబు, మందపల్లి సంజీవరావు, వేమగిరి మోషే, వల్లూరి దొరకయ్య ఇందిరా రాణి తదితరులు హాజరై దొరబాబు సుధారాణి దంపతులను సత్కరించారు. మెమెంటో లను బహూకరించి అభిమానం చాటుకున్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

ప్రజాశక్తి - సామర్లకోట

క్రీడల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచే వారికి శారీరక మానసిక ఆరోగ్యంతో పాటు ఉత్తమ భవిష్యత్తు ఉంటుందని పలువురు వక్తలు అన్నారు. ఆదివారం స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో క్రికెట్, కబాడీ బాస్కెట్‌బాల్ క్రీడల్లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రికెట్ ప్లేయర్ యశ్వంత్ తేజ , కబాడీ ప్లేయర్స్ వర్షిత, అరుణ, బాస్కెట్‌బాల్ ప్లేయర్ కిరణ్‌లను ఫ్రెండ్స్ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ నాయకులు ఎండి సైపుల్ల, విప్పర్తి కొండలరావు, గుండు శంకర్రావు, మణిరాజు, శ్రీనివాసరావు, చిట్టిబాబు పాల్గొన్నారు.

కుక్కల బెడద నిర్మూలనకు చర్యలు

ప్రజాశక్తి - యానాం

నియోజకవర్గంలో శునకాల బెడదను నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. ఆదివారం మల్లాడి స్వగృహంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. సుమారు రూ.35 లక్షల వ్యయంతో కుక్కల వ్యాక్సిన్, వాటి సం రక్షణ, మనుషులకి ఎవరికీ హాని కలగకుండా చూసేం దుకు ప్రత్యేకమైన బృందాలతో వాటిని నివారించే దిశగా చర్యలు చేపడతామన్నారు. సుమారు మూడు వేలకు పైగా ఊర కుక్కలు ఉన్నట్లు అధికారులు గుర్తించారన్నారు. ప్రతి కుక్కకు వ్యాక్సిన్, ఆపరేషన్ చేయడానికి రూ.1000 నుంచి రూ.1500 వరకూ ఖర్చు అవుతుందని, ఇది మున్సిపాలిటీకి పెద్ద భారమేనని అన్నారు. ఈ సమావేశంలో ఆర్ఎఒ మునిస్వామి, మున్సిపల్ కమిషనర్ కండవల్లి రామకృష్ణ పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న సిబ్బంది

9 నుంచి మున్సిపల్ ఇంజినీరింగ్ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సమ్మె

ప్రజాశక్తి - మండపేట

రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనున్న మునిసిపల్ ఇంజినీరింగ్ ఔట్ సోర్సింగ్ సిబ్బంది సమ్మె లో తాము భాగస్వాములు అవుతున్నామని మండపేట పురపాలక సంఘం ఇంజినీరింగ్ విభాగం ఔట్ సోర్సింగ్ సిబ్బంది పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం మండపేట కమిషనర్ టివి.రంగారావుకు సమ్మె నోటీసులు అందజేశారు. రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు ఈ నెల 9వ తేదీ నుంచి సమ్మెకు దిగుతామని కమిషనర్ రంగారావుకు సమ్మె నోటీసు ఇచ్చారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఎపిఎంఇడబ్ల్యూ ఆధ్వర్యంలో ఈ సమ్మె నిర్వహిస్తామని ప్రకటించారు. మునిసిపాలిటీ ల్లో పారిశుధ్య ఔట్ సోర్సింగ్ కార్మికులకు రూ.25వేలు నెల జీతం ఇస్తున్నారన్నారు. తమకు కేవలం రూ. 13,500 మాత్రమే చెల్లిస్తున్నారని అవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు ఉన్న పరిస్థితి దష్ట్యా ధరల భారం తో తాము ఈ చాలీచాలని జీతంతో తాము ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. వెంటనే తమ వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. పలు సమస్యలని పరిష్కరించాలని కోరుతూ ఈ సమ్మె నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాలపర్తి సుబ్బరాజు, తలాటి వెంకన్న, కప్పల సురేంద్ర, టేకి వెంకన్న, జి.అశోక్ తదితరులు పాల్గొన్నారు



ద్రాక్షారామలో గుర్రాల పరంజ్యోతి వర్ధంతి సభ

పరంజ్యోతి ఆశయాలు ఆదర్శనీయం

ప్రజాశక్తి - రామచంద్రపురం

పీడిత ప్రజల నాయకుడు గుర్రాల పరంజ్యోతి ఆశయాలు ఆదర్శనీయమని న్యూ డెమోక్రసీ పార్టీ జిల్లా నాయకులు చీకట్ల వెంకటేశ్వరరావు అన్నారు. ద్రాక్షారామలో ఆదివారం పరం జ్యోతి 19వ వర్ధంతి సభ నిర్వహించారు. ఇక్కడ గల స్మారక స్థూపం వద్ద జరిగిన కార్యక్రమంలో అరుణోదయ సాంస్కతిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంటపల్లి భీమశంకరం, అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యు.గనిరాజు, కార్యదర్శి సిద్ధు, పివైఎల్ రాష్ట్ర కార్యదర్శి వి.చిట్టిబాబు, పరంజ్యోతి సతీమణి గుర్రాల దయమణి, రాహుల్, సత్యవేణి కుటుంబ సభ్యులు తదితరులు పరంజ్యోతి గారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ అనారోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా ప్రజల కోసం నిరంతరం తపనతో పని చేసిన కష్టజీవి పరంజ్యోతి ఆశయాలు అనుసరణీయమన్నారు. దళితుల హక్కులు కోసం ముఖ్యంగా వెంకటాయపాలెం గ్రామంలో దళిత యువకులకు శిరోముండనం చేసిన ఘటనకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా బలమైన ఉద్యమాలకు నాయకత్వం వహించారన్నారు. ఈకార్యక్రమానికి రామచంద్రపురం డివిజన్ నలుమూలల నుంచి వందలాదిమంది తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు నాయకులు చింతా రాజారెడ్డి కృష్ణ, వీర, అరుణోదయ రాష్ట్ర నాయకులు శ్రీను, లక్ష్మణ్, శ్రీను, రామకష్ణ, పట్టాభి, కార్తీక్, రావి భాను, పాల్గోన్నారు.